సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 30 । మార్చి । 2023



క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

క్రమశిక్షణతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. -10లో..



తొలగించిన అందరికీ ఓటు హక్కు

రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఓటు తొలగింపునకు గురైన వారందరికీ హైకోర్టు జోక్యంతో ఓటు హక్కు లభించింది. -10లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.84	రూ.104
రెండోరకం	రూ.50	రూ.82



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 211 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	550	553
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 276.34 కిలోలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
రాజంపేట	6.31	4.53
రాయచోటి	6.31	4.52
మదనపల్లి	6.33	4.53
పీలేరు	6.28	4.47

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

వైవీయూ పాలకమండలి సభ్యుల పదవీకాలం పొడిగింపు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి గడువును 60 రోజులు లేదా తదుపరి పాలకమండలి ఏర్పాటయ్యే వరకు కొనసాగిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2020 మార్చి 23న ఏర్పాటైన వైవీయూ పాలకమండలి ఈ యేడాది మార్చి 22వ తేదీనాటికి పాలకమండలి మూడు సంవత్సరాల గడువు ముగిసింది. దీంతో వైవీయూ అధికారులు నూతన పాలకమండలి నియామకానికి జాబితాను సైతం సిద్ధం చేసి ఉన్నత విద్యామండలికి పంపారు. తాజాగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పూర్వపు పాలకమండలి సభ్యులు యధావిధిగా కొనసాగనున్నారు.

రేపు దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి సంస్మరణ సభ

కడప కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమి మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సంస్మరణ సభను శుక్రవారం నిర్వహించనున్నారు. స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో ఉదయం 10.00 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమానికి రాజకీయ ప్రముఖులు, ప్రజా ఉద్యమ నేతలు, అధికారులు, డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి, సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, భూమన్, రాష్ట్ర ప్రభుత్వ అంతర్ రాష్ట్ర సంబంధాల సలహాదారులు దేవులపల్లి అమర్, సీనియర్ ఎడిటర్ కె.రామచంద్రమూర్తి, ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి. పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, తులసిరెడ్డి, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు హాజరు కానున్నారు.


వెనుకబడిన వర్గాల పిల్లలకు సీట్లు కేటాయించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను సమాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కేటాయించాలని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్, ఎఫ్ఏసీ ఆర్‌జేడీ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలో డీఈఓ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ముద్రించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీ వరకు 5 నుంచి 6 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు 1వ తరగతిలో ఉచిత ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు.సీఎస్‌సీ.ఏపీ పీ.జీవోవీ.ఇన్/ఆర్‌టిఈ వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ బిల్లు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం జిల్లా వ్యాప్తంగా ఈనెల 30వ తేదీ గురువారం సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. మునిశంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు.

జగనన్న గృహ లబ్ధిదారులకు విధిగా పనిదినాలు కల్పించాలి



మాట్లాడుతున్న పీడీ మద్దిలేటి

రాజంపేట టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని జగనన్న గృహ లబ్ధిదారులకు విధిగా 90 రోజుల పనిదినాలను కల్పించాలని ఉపాధి హామీ పథకం పీడీ మద్దిలేటి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీ పాల్గొని మండలంలోని పంచాయతీల వారీగా జరిగిన ఉపాధి హామీ పథకం పనుల వివరాలను సంబంధిత మేట్ల ద్వారా తెలుసుకున్నారు. కొన్ని పంచాయతీల్లో వివిధ పనులకు సంబంధించి నగదు లావాదేవీల్లో రూ.15 వేలు వ్యత్యాసం ఉండటంతో రికవరీకి ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జగనన్న గృహ లబ్ధిదారులకు జాబ్ కార్డు లేకుంటే జాబ్ కార్డు చేయించి పనులు కల్పించాలని సూచించారు. ఏప్రిల్ నుంచి కూలీ 257 రూపాయల నుంచి 272 రూపాయలకు పెరుగుతుందన్నారు. డీవీఓ ప్రకాష్, ఏపీడీ ప్రతాప్, ఎస్ఆర్‌పీ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నవరస భరితం.. రాముడి చరితం



- జాంబవంతుడు ప్రతిష్టించిన రామక్షేత్రం ఒంటిమిట్ట కోదండరామాలయం
- త్రేతాయుగంలో సీతారామలక్ష్మణ నివాసమే ఏకశిలానగరం
- ఆంజనేయుడు లేకపోవడమే ఆలయ ముఖ్య విశేషం
- వంటడు..మిట్టడుతో ఆలయ నిర్మాణానికి అంకురార్పణ
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఒంటిమిట్ట రామాలయం (ఇన్‌సెట్) ఏకశిలపై సీతారామలక్ష్మణ మూర్తులు

రాజంపేట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట రామాలయం టీటీడీలో విలీనమైన తర్వాత రాములోరి బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని భద్రాచలానికి దీటుగా ఒంటిమిట్ట రామాలయాన్ని తీర్చిదిద్దారు. ఈనెల 30 నుంచి ఏప్రిల్ 9 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఏప్రిల్ 5న రాములోరి కల్యాణం కనుల పండువగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట కోదండరామాలయంపై ప్రత్యేక కథనం.

త్రేతాయుగంలో సీతారామలక్ష్మణ నివాసం..

త్రేతాయుగంలో సీతారామలక్ష్మణులు ఈ ప్రాంతంలో కొంతకాలం నివసించారు. అప్పుడు సీతమ్మకు దాహం వేసింది. రాముడు బాణం సంధించి భూమిలోకి వదిలాడు. నీరు పైకి ఎగజిమ్మింది. సీతమ్మ దప్పిక తీరింది. లక్ష్మణుడు అన్న అనుజ్ఞతో తానూ ఒక బాణం వదిలాడు. నీరుపైకి వచ్చింది. ఆ నీటి బుగ్గలను నేడు రామతీర్థం..లక్ష్మణతీర్థం అని పిలుస్తున్నారు.

ధర్మసంస్థాపన కోసం ఒంటిమిట్ట గుడి..

బుక్కరాయలు కోదండరామాలయం నిర్మించాడు. రాముడిక్కడ కోదండం ధరించి ఉన్నాడు. కోదండం ధర్మరక్షణకు ప్రతీక. అలనాడు శ్రీరామచంద్రుడు అడవుల్లో తిరుగుతూ నార చీరలు ధరించినా కోదండాన్ని విడువలేదు. అది ధర్మరక్షణ కోసమే. బుక్కరాయల తర్వాత సిద్దవటం మట్లిరాజులు ఆలయాన్ని అత్యంత వైభవోపేతంగా తీర్చిదిద్దారు. అనంతరాజు, తిరుమలరాయలు, తిరువెంగళనాథ రాజు, కుమార అనంతరాజులు ఒంటిమిట్ట కోవెల్ని తీర్చిదిద్దారు. ఉన్నతమైన ప్రాకార కుడ్యాలు సమున్నతమైన గోపుర శిఖరాలు రంగమంటపాల్లో అద్భుత శిల్ప విన్యాసాలు కనిపిస్తాయి.

ఏకశిలానగరంగా..

ఒంటిమెట్ట మీద నిర్మించిన ఆలయం ఉన్న ప్రదేశం ఒంటిమిట్ట అయింది. ఒంటిమిట్ట గుడికి అనురూపంగానే ఏర్పడిన మరోపేరు ఏకశిల. ఒకేశిలలో సీతారామలక్ష్మణ విగ్రహాలు నిర్మించారు. జాంబవంతుడు ముగ్గురిని ఒకే శిలలో భావించుకున్నాడు. ఆ తర్వాత కాలంలో కంపరాయలు, బుక్కరాయలు అదే సంప్రదాయంతో ఏకశిలలో ముగ్గురు మూర్తులు ఉండేలా నిర్మాణం చేయించారు. బహుశా ఒకే శిలలో ముమ్మూర్తులను నిలిపిన సంఘటన ఒంటిమిట్టలో మొదటిగా ఆవిష్కృతమైంది. అరుదుగా కొలువైన ఏకశిలా విగ్రహ ప్రాంతాన్ని ఏకశిల అని భక్తితో అన్నాడు పోతన.

ఒంటిమిట్ట కవులు..అపరభక్తులు..

ఒంటిమిట్ట కోదండరాముని సేవిస్తూ కవులెందరో తరించారు. వారిలో అయ్యలరాజు తిప్పయ్య, బమ్మెర పోతన, అయ్యలరాజు రామభద్రుడు, ఉప్పుగొండూరు వెంకటకవి, వరకవి నల్లకాల్వ అయ్యప్ప, వాసుదాసు వావిలికొలను సుబ్బారావులు కోదండరామునిపై సాహిత్యం, కీర్తనలు, రచనలతోపాటు ఆలయ అభివృద్ధికి తోడ్పడ్డారు.. మాలఓబన్న, ఇమామ్‌బేగ్ లాంటి ఎందరో అపర భక్తరామదాసులు స్వామివారిని సేవించి తరించిపోయారు.

బ్రహ్మోత్సవ వివరాలు

- మార్చి 30 న వ్యాసాభిషేకం, సాయంత్రం అంకురార్పణ
- 31న ధ్వజారోహణం, సాయంత్రం పోతన జయంతి, రాత్రికి శేషవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనం
- ఏప్రిల్ 01న వేణుగానాలంకారం, రాత్రికి హంసవాహనంపై ఊరేగింపు
- 02న వటపత్రసాయి అలంకారం, రాత్రికి సింహవాహనంపై భక్తులకు దర్శనం
- 03న నవనీత కృష్ణాలంకారం, రాత్రికి హనుమంతసేవ
- 04న మోహినీ అలంకారం, రాత్రి గరుడ సేవలో కోదండరాముడు
- 05న శివధనురాణాలంకారం, రాత్రికి ఎదుర్కోలు ఉత్సవం, అనంతరం పండువెన్నెలలో 8గంటల నుంచి 10గంటలలోపు సీతారాముల కల్యాణం
- 06న రథోత్సవం
- 07న కాళీయమర్ధనాలంకారం, రాత్రికి అశ్వ వాహనం
- 08న చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం
- 09న రాత్రి పుష్పయాగం, ఏకాంతసేవలో కోదండరాముడు

ప్రధాన విశేషం

సీతారామలక్ష్మణులు కొలువు దీరిన ప్రతి ఆలయంలోనూ ఆంజనేయస్వామి చేతులు కట్టుకొని దర్శనమిస్తుంటాడు. కాని ఒంటిమిట్ట గుడిలో సీతారామలక్ష్మణులు తప్ప ఆంజనేయస్వామి లేడు. ఆంజనేయస్వామి విగ్రహంలేని లోటు తీరుస్తూ సంజీవరాయుడిగా వెలసిన ఆంజనేయ స్వామి గుడి నిర్మించారు. ఈ గుడి తూర్పు గాలిగోపురానికి తూర్పుగా రథశాల పక్కనే కనిపిస్తుంది.

విజయనగర సామ్రాజ్యంలో క్రీ.శ. 1340లో ఉదయగిరి పాలకుడు కంపరాయలు ఒంటిమిట్ట ప్రాంతంలో పర్యటించాడు. ఆయన కొంతపరివారాన్ని వెంటబెట్టుకొని వచ్చాడు. ఈ అడవుల్లో ఇద్దరు బోయలు ఉండే వారు. వారే వంటడు, మిట్టడు. వీరు రాజుకు సేవలందించారు. ఈ సమయంలో సమీపంలో గుట్ట మీద చిన్నపాటి గుడి ఉంది. జాంబవంతుడు నిలిపిన శిలలో సీతారామలక్ష్మణులని భావించి దండం పెట్టుకుంటున్నామని, అక్కడ గుడి కట్టి పుణ్యం కట్టుకొమ్మన్నారు. వంటడు..మిట్టడు కోరిక మేరకు

ఆలయ పూర్వ చరిత్ర..

కంపరాయలు గుడి, చెరువు నిర్మించేందుకు అంగీకరించాడు. ఆ బాధ్యత బోయలకే అప్పగించాడు.

ఆలయ నిర్మాణం ఇలా..

విజయనగర సామ్రాజ్య చక్రవర్తి బుక్కరాయలు ఒంటిమిట్ట గుడిలో ఏకశిలా విగ్రహం నిలిపిన నాటికి గర్భాలయం, అంతరాళం, చిన్నగోపురం ఉండేవి. మొదటిదశ నిర్మాణమిది. మూడవ దశలో మహామంటపం, మహాప్రాకారం, తూర్పు, ఉత్తర , దక్షిణ గాలిగోపురాలు, మహాప్రాకారం లోపల నైరుతి దిక్కున కల్యాణమంటపం, ఆగ్నేయదిశలో పాకశాల, ప్రాకారంలోపల ఉత్తరం వైపు తూర్పున, పడమర ఎదుర్కోలు మంటపాలు, రామలింగదేవుని గుడి (1966)లో లింగాన్ని నిలిపారు. సంజీవరాయ స్వామి, రథం, రథశాలను ఏర్పాటు చేశారు. అనంతరం అనంతరాజు గుడిని విస్తరించాడు. మహామంటపం, మహాప్రాకారం, గాలిగోపురాల నిర్మాణాలు చేపట్టారు. తెలుగురాష్ట్రాలలో ఒంటిమిట్ట గాలిగోపురాల తరహాలో మరెక్కడా కనిపించవు.

రాత్రిపూటే కల్యాణం..

ఒంటిమిట్ట రామాలయంలో స్వామివారి కల్యాణం రాత్రిపూట నిర్వహిస్తారు. చతుర్థశినాటి రాత్రి వివాహ మహోత్సవం, కళాపూర్ణుడైన చంద్రుడు సీతారామకల్యాణాన్ని పరమానందంతో తిలకిస్తాడని పురాణకథ చెబుతోంది. కాగా రాత్రి కల్యాణం సంప్రదాయం ఇప్పటిది కాదు. ఒంటిమిట్ట ఆలయం ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇలాగే జరుగుతోంది.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



పుష్పాలంకరణలో ఆలయ రంగమండపం

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో గురువారం నుంచి ప్రారంభం కానున్న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాముడి సన్నిధిలో చలువ పందిళ్లు వేశారు. యాగశాలను నిర్మించారు. సర్వదర్శనం, అన్నప్రసాదం , వాహనాలు నిలుపు స్థలం, వైద్య శిబిరం, సమాచార కేంద్రాల కోసం ప్రత్యేకంగా జర్మనీ తరహా షెడ్లను ఏర్పాటు చేశారు.

కల్యాణ వేదిక ముస్తాబు

వచ్చే నెల 5న జరగనున్న సీతారాముల పరిణయ ఘట్టానికి కల్యాణ వేదికను ముస్తాబు చేస్తున్నారు. ఈ ప్రాంగణంలో 8వ సారి రామయ్య పెళ్లి జరగనుంది. భక్తులందరికి ముత్యాల తలంబ్రాల పొట్లాలు పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. అలాగే వచ్చే భక్తులకు దాదాపు 6 లక్షల తాగునీరు ప్యాకెట్లు, సుమారు 3 లక్షల మజ్జిగ ప్యాకెట్లు, కల్యాణానికి వచ్చే ప్రతి భక్తుడికి అన్నప్రసాదం అందేలా కౌంటర్లను అందుబాటులో ఉంచనున్నారు. కాగా శ్రీ రామనవమిని పురస్కరించుకుని ప్రభుత్వం తరపున రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సతీ సమేతంగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

నేడు, రేపు కవిసమ్మేళనం

ఒంటిమిట్ట: శ్రీరామనవమి, పోతన జయంతిని పురస్కరించుకుని టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 30, 31 తేదీల్లో కవి సమ్మేళనం జరుగుతుందని టీటీడీ పీఆర్‌ఓ రవి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రొఫెసర్ జి. ఎస్. ఆర్ కృష్ణమూర్తి అధ్యక్షతన పోతన భాగవతంపై జరిగే కవి సమ్మేళనంలో ఎం. నారాయణరెడ్డి, డాక్టర్ బి. గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ కె. సుమన, పి. శంకర్, వి. చిన్నయ్య, ఎం. లోకనాథం పాల్గొంటారన్నారు. 31న టీటీడీ అర్చక శిక్షణ కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ కుమార్ అధ్యక్షతన శ్రీరామ పాదుకాపట్టాభిషేకంపై జరిగే కవి సమ్మేళనంలో ఎల్. జగన్నాథశాస్త్రి, ఎం. మల్లికార్జునరెడ్డి, వై. మధుసూదన్, సి. శివారెడ్డి, యు, భరత్ శర్మ, పి. నీలవేణి పాల్గొంటారు.

సమన్వయంతో పనులు చేయాలి

జేసీ సాయికాంత్ వర్మ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ సాయికాంత్‌వర్మ

కడప సిటీ : ఒంటిమిట్టలో ఏప్రిల్ 5 న జరగనున్న సీతారాముల కల్యాణోత్సవ ఏర్పాట్లను అన్ని శాఖలు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఒంటిమిట్ట కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై ఆయన ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్ గౌడ్ లతో కలిసి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఏప్రిల్ 5న జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రముఖులు రానున్నందున అన్ని రకాల ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, డ్వామా పీడీ యదుభూషణరెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్, వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపీసీ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్, ఆర్టీసీ, ఆర్టీఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సింహవాహనంపై ప్రతాప రాముడు



సింహవాహనంపై ఊరేగుతున్న ప్రతాపరాముడు

వైభవంగా కల్పవృక్ష వాహనం

వాల్మీకిపురం: వాల్మీకి క్షేత్రంలో శతాబ్దాల చరిత్ర కలిగిన పట్టాభిరాములవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజు బుధవారం రాత్రి 8 గంటలకు స్వామివారు సింహవాహనంపై అధిరోహించి భక్తులను కటాక్షించారు. మహిళలు సింహవాహనంపై ఊరేగుతున్న స్వామివారికి నేతి దీపాలతో తిరుమాఢ వీధుల్లో స్వాగతం పలికారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు వేకువ జామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన చేశారు. అనంతరం ఉదయం 8గంటలకు స్వామివారు కల్పవృక్ష వాహనంపై తిరుమాఢ వీధుల్లో విహరించి, భక్తుల కోరికలను తీర్చే కల్పతరువు తానేనని భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 10గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజన సేవ నిర్వహించి, సాయంత్రం ఊంజల మండపంలో ఊంజల సేవ నయనానందకరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్‌రాయులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది దుశంత్, నాగరాజ, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8గంటలకు సర్వభూపాల వాహనం, 10గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6గంటలకు ఊంజల సేవ, రాత్రి 8గంటలకు పెద్దశేష వాహన సేవ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

ఆసరా వారోత్సవాల్లో కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

రాయచోటి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని కలెక్టర్ గిరీషా పీఎస్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాయచోటిలోని మార్కెట్ ఉర్దూపాఠశాల, డైట్ కళాశాల ఆవరణంలో వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత వారోత్సవాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నారు. మహిళల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి పథకాలు ప్రవేశపెడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందస్తుగా సంక్షేమ క్యాలెండర్‌ను రూపొందించి ఆ మేరకు పథకాలు నేరుగా ప్రజలకే అందేలా అమలు చేస్తున్నారని చెప్పారు. విద్యాదీవెన, వసతిదీవెనల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ విద్యార్థులను చదువు దిశగా ప్రోత్సహిస్తున్నారన్నారు. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా దిశ చట్టంతో పాటు మహిళాపోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని కోరారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే విమర్శలు

ముఖ్యమంత్రి జగన్‌కు రోజురోజుకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు పనిగట్టుకుని దుష్ప్ర చారం చేస్తున్నాయని శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. దివంగత సీఎం వైఎస్ఆర్, ప్రస్తుత సీఎం జగన్ పాలనలోనూ ఎన్నో శాశ్వత అభివృద్ధి పనులు జరిగాయన్నారు. టీడీపీ పాలనలో ఎలాంటి శాశ్వత అభివృద్ధి పనులు లేవని విమర్శించారు.

బాబుకు ప్రజాబలం ఉంటే ఒంటరిగా పోటీచేయొచ్చు కదా ?

చంద్రబాబుకు నిజంగా బలం ఉంటే ఎన్నికల్లో ఎవరితో పొత్తుపెట్టుకోకుండా ఒంటరిగా పోటీచేయాలని శ్రీకాంత్‌రెడ్డి సవాల్ విసిరారు. బాబు పాలనలో మోసం, దగా తప్ప ప్రజలకు ప్రత్యేకంగా ఒరిగిందేమీ లేదన్నారు.

రాయచోటి జిల్లా కేంద్రం కావడం వరం

రాయచోటి పట్టణం అన్నమయ్య జిల్లా కేంద్రం కావడం అందరికీ వరం లాంటిదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే జిల్లా కేంద్రాన్ని మారుస్తామని చెబుతుండడం చూస్తే వారికి రాయచోటిపై ఏమాత్రం ప్రేమ ఉందో తెలుస్తోందన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, మార్కెట్‌కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు జ్యోత్స్నకుమారి, సలీం, నరసింహారెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మదనపల్లె పరిశీలకుడు హబీబుల్లాఖాన్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలు: కలెక్టర్ గిరీషా పీఎస్



అధికారుల సమీక్షలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఆయన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, విద్యా శాఖాధికారులతో కలిసి పరీక్షా కేంద్రాలలో చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీక్షలో డీఆర్‌ఓ సత్యనారాయణ, డీఈఓ పురుషోత్తం, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 123 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 22,395 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షలు జరిగే రోజున పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయిస్తామన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఇన్విజిలేటర్లు, విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకుండా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

సంబేపల్లె : జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ చైర్మన్ మునగమురళీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ. 1,96,439 ఆదాయం లభించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కొండారెడ్డి, వి.వి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

సుండుపల్లె (వీరబల్లి) : సుండుపల్లె మండలంలోని చిన్నగొల్లపల్లి పంచాయతీ, కొత్తజంగంపల్లిలో ఈనెల 14న జరిగన దాడిలో గాయపడిన మునీంద్ర ఈనెల 24వ తేదీ చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ కేసులో ముగ్గురు నిందితులను రాయచోటి గ్రామీణ సీఐ లింగప్ప ఆధ్వర్యంలో మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వీరిలో ఒకరు మైనర్ ఉన్నాడన్నారు. నిందితులు ఆంజనేయులు, సూర్యప్రకాష్ ను రాయచోటి కోర్టులో , మైనర్‌ను కడపలో హాజరు పరిచామని తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి


రామిరెడ్డి మృతదేహం

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ, ఇండ్లూరు గ్రామానికి చెందిన ఇప్పగుంట రామిరెడ్డి (57) మంగళవారం రాత్రి పాముకాటుతో మృతి చెందినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. వివరాలు..తన పొలంలో సాగుచేసిన జొన్న పంటకు నీరు వేసేందుకు పొలానికి వెళ్లాడు.రాత్రి 11గంటలకు తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో పాము కాటు వేసింది. సమాచారాన్ని బంధువులకు తెలిపాడు. వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వేర్వురు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పట్టణంలోని ప్యారానగర్‌కు చెందిన జిలానీ భార్య రేష్మా(35) కుటుంబంలోని గొడవలతో మనస్తాపం చెంది బుధవారం నిద్రమాత్రలు మింగింది. అదేవిధంగా రెడ్డెప్పనాయుడు కాలనీకి చెందిన సోమశేఖర్ భార్య శ్రావణి(20) ఇంటిలోని వేధింపులు భరించలేక గుళిక మందు తినింది. గమనించిన కుటుంబసభ్యులు బాధితులను జిల్లా ఆస్పత్రికి తరలించారు.

తల్లీ కొడుకులపై దాడి

మదనపల్లె : ఇరు కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదంతో కొందరు వ్యక్తులు తల్లీ కొడుకుపై దాడిచేసిన సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. చీకలబైలుకు చెందిన అమరేంద్ర(43) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన బోడెన్న తన గురించి ఇతరులకు చెడుగా చెపుతున్నారని భావించి అమరేంద్రపై కుటుంబసభ్యులతో కలిసి దాడిచేశాడు. కుమారుడిని రక్షించేందుకు అడ్డుగా వచ్చిన అమరేంద్ర తల్లి రమణమ్మ(66)పై కూడా దాడిచేశారు. దాడిలో తల్లీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే ఇంటివద్ద చెత్తచెదారం పడి అపరిశుభ్రంగా ఉందని వేరే వాళ్లకు చెబుతుండగా, తన గురించే చెపుతున్నాడని, అనుమానం పెట్టుకున్న బోడెన్న కుటుంబసభ్యులతో కలిసి తనపై దాడిచేసినట్లు బాధితుడు చెప్పాడు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు


మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న హోంగార్డ్స్ (ఇన్‌సెట్) మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి : క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ.. మెరుగైన సేవలు అందిస్తూ జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. జిల్లా హోంగార్డ్స్‌కు రెండు వారాలపాటు నిర్వహించిన మొబిలైజేషన్ కార్యక్రమం బుధవారం ముగిసింది. స్థానిక పోలీసు పేరెడ్ మైదానంలో బుధవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలు సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు దోహదం చేస్తాయన్నారు. విధులతోపాటు ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అందులో భాగంగానే యోగా, ధ్యానం గురించి ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు చప్పారు. వ్యక్తిగత నైపుణ్యాల పెంపునకు, ఆర్థిక క్రమశిక్షణపై నిపుణులతో మొబిలైజేషన్‌లో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు చెప్పారు డ్రిల్, కవాతు, మాబ్ కంట్రోల్, ప్రముఖుల బందోబస్తు తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశా నిర్దేశం చేశారు. సిబ్బంది సంక్షేమంలో భాగంగా పలు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తే ఉపేక్షించం

క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహించే వారిని ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆన్‌లైన్ గేమ్స్, క్రికెట్ బెట్టింగ్ మోసాలకు గురవుతున్న యువతను ఉద్దేశించి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఒకసారి ఆడి చూద్దామని సరదాగా మొదలుపెట్టి వాటి బారిన పడిన యువకులు బయటికి రావడమనేది కష్టతరమైన విషయమన్నారు. ఆధునిక పరిజ్ఞానం మనిషి జీవితాన్ని సులభతరం చేస్తుందని, క్లిష్టమన సమస్యలకు చిటికెలో చక్కటి పరిష్కారం చూపుతుందన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో రోజుకొక రకమైన క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఆఫర్స్, బెట్టింగ్ ఫ్రీ అంటూ యువతను ఆకర్షించి వారి జీవితాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. బెట్టింగ్‌కు అలవాటుపడిన వారు అప్పులుపాలు కావడమే కాకుండా చేసిన అప్పులు తీర్చలేక చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు ఈనెల 31వ తేదీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎస్) సీజన్ మొదలు కాబోతున్నందున ప్రజలలో క్రికెట్‌కు ఉన్న మక్కువను ఆసరాగా తీసుకొని క్రికెట్ బెట్టింగ్ ముఠాలు ఎలాగైనా క్యాష్ చేసుకోవడానికి సిద్ధంగా ఉంటాయన్నారు. క్రికెట్ బెట్టింగ్‌ను అరికట్టేందుకు ముందుగా ప్రజలలో విస్తృత అవగాహన కల్పించే ప్రయత్నం చేద్దామన్నారు. ప్రజలు కూడా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు.

తొలగించిన అందరికీ ఓటు హక్కు

- ప్రతిష్టాత్మకంగా రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు
- 31న ఓటింగ్..కౌంటింగ్ పెండింగ్


న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి

రాజంపేట : ఉభయ జిల్లాలో బార్ అసోసియేషన్ ఎన్నికలు న్యాయవాదులు పరస్పర అవగాహనతో ప్రశాంతంగా జరుగుతున్నాయి. అయితే పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. కొందరి ఓట్ల తొలగింపు వ్యవహారంతో వివాదంలోకి నెట్టివేశాయని న్యాయవాదులు అంటున్నారు.సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ్, సుబ్బారావు, కొండూరు రామరాజు, ఆకేపాటి చెంగల్‌రెడ్డి, ఏబీ సుదర్శనరెడ్డి, నాగరాజుగుప్తా, కొండూరు శరత్‌కుమార్‌రాజు లాంటి దిగ్గజాలు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగిన చరిత్ర రాజంపేట బార్‌కు ఉంది.

31న పోలింగ్..

ఈనెల 31న ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌ను నిర్వహిస్తారు. ఎన్నికల అధికారి బాలాజీ నేతృత్వంలో పోలింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు. అయితే హైకోర్టు తదుపరి తీసుకునే నిర్ణయం మేరకు కౌంటింగ్ ఉంటుంది. అప్పటి వరకు పోలింగ్ బాక్స్‌ను సీల్ వేసి భద్రపరచాల్సిఉంటుందని ఇప్పటికే హైకోర్టు డైరక్షన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. హైకోర్టు జోక్యంతో ఓటరు జాబితాలో నుంచి తొలిగించిన న్యాయవాదులందరికీ ఓటు హక్కు లభించింది. అసోసియేషన్‌లో 130 మంది న్యాయవాదులు ఉండగా, ఒకరు మృతి , ఒకరి డబుల్ ఎంట్రీ,ఇద్దరు అవుట్ ఆఫ్ స్టేషన్ కావడంతో 126 మంది ఓటర్లుగా ఉన్నారు. ఇందులో వివిధ కారణాలతో 24 మందిని తొలిగించారు. దీంతో ఓటర్లు 102కు చేరారు. ఈ నేపథ్యంలో 24 మంది హైకోర్టుకు వెళ్లి ఓటు హక్కును తెచ్చుకున్నారు.

సురేంద్రబాబు ప్యానల్‌లో ముగ్గురు ఏకగ్రీవం..

బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల్లో అధ్యక్ష స్థానాలకు సురేంద్రబాబు, లక్ష్మీనారాయణలు బరిలోకి దిగారు. ఇప్పటికే సురేంద్రబాబు ప్యానల్‌కు ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ ,కోశాధికారి వీవీరమణ, స్పోర్ట్స్ సెక్రటరీ మహబూబ్‌బాషా వీరిద్దరు ఏకగ్రీవమయ్యారు. ఇక పోటీలో నిలిచిన వారిలో జనరల్ సెక్రటరీ ఆనందకుమార్, జాఫర్‌బాషా, జాయింట్‌సెక్రటరీ సుందరరామరాజు, గోపాల్‌రెడ్డిలు ఉన్నారు. లైబ్రరీ సెక్రటరీకు ఎవరూ లేరు.

న్యాయవాదులతో డీఎస్పీ భేటీ

బార్ అసోసియేషన్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి న్యాయవాదులతో బార్ కార్యాలయంలో భేటి అయ్యారు. ఎన్నికలను స్నేహభావంతో, శాంతియుత వాతవరణంలో జరుపుకోవాలన్నారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు శరత్‌కుమార్‌రాజు, ఏబీ సుదర్శనరెడ్డి, మాజీ ఏజీపీ నాగరాజుగుప్తా, న్యాయవాదులు, కెఎంఎల్ నరసింహులు, సురేంద్రబాబు, సుందర్, కుమార్‌రాజు, మౌలానా, శివరాంగౌడ్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పీలేరురూరల్ : యువకుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన బుధవారం మండలంలోని వేపులబైలు పంచాయతీ బండమీదపల్లెలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బండమీదపల్లెకు చెందిన ఆదినారాయణ కుమారుడు పూల కిరణ్‌కుమార్ (40) బుధవారం పురుగుల మందు తాగాడు. పురుగుల మందు తాగే ముందు తను ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి గ్రామంలోని బి. బాలాజి, బి. శ్రావణ్ కుమార్, బి. యర్రయ్య, పి. పోతయ్య, పి. నీలావతి, పి. శ్రీనివాసులు, బి. రంగనాథ్, బి. దామోదర్ కారణమని పేపరుపై రాసిపెట్టాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. కొంతకాలంగా ఇంటి స్థల విషయమై తరచూ గొడవలు జరుగుతుండేవని, ఈ క్రమంలో బుధవారం మరోసారి గొడవ జరిగి కిరణ్‌కుమార్ ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్‌కు సంబంధించి ప్రథమ, ద్వితీయ పరీక్షలు బుధవారం ముగిశాయి. వైఎస్సార్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 92 పరీక్షా కేంద్రాల్లో రసాయన, వాణిజ్యశాస్త్రం, ఒకేషనల్ పరీక్షలకు 21,471 మంది విద్యార్థులకుగాను 20,625 మంది హాజరయ్యారు. 846 మంది గైర్హాజరయారు. వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠంలో నలుగురు, పులివెందులలో ఇద్దరు, అన్నమయ్య జిల్లా రాయచోటిలో నలుగురు, లక్కిరెడ్డిపల్లెలో ఒకరి చొప్పున విద్యార్థులను డీబార్ చేసినట్లు ఆర్ఐవో రమణరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 12 రోజులపాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా సాగాయన్నారు. ఇందుకు సహకరించిన జిల్లా కలెక్టర్, ఆర్టీసీ, విద్యుత్ అధికారులు, పోలీసులకు ఆర్ఐవో ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 31,ఏప్రిల్ 1,3,4 తేదీల్లో ఒకేషనల్, బ్రిడ్జి కోర్సులకు సంబంధించి 13 పరీక్షా కేంద్రాల్లో మాత్రమే పరీక్షలు జరగనున్నట్లు ఆయన తెలిపారు.

ఏసీబీ వలలో వీఆర్వో

– రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత


వీఆర్వో ఏసుదాసు


పట్టుబడిన నగదు

రైల్వేకోడూరు : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలంలో ఆయకట్టుదారులకు సంబంధించి జన్యూన్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు కాంట్రాక్టర్ నుంచి 20వేలు లంచం తీసుకుంటున్న వీఆర్వో ఏసుదాసును బుధవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పట్టణంలోని స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ కంజాక్షన్ తెలిపిన వివరాల మేరకు రైల్వేకోడూరు మండలం ఓబనపల్లె పంచాయతీలోని పిచ్చయ్యకుంట, పెద్దకుంట, మర్రిమానుకుంట చెరువులకు సంబంధించి 17-01-2022, 05-01-2023 సంవత్సరానికి గాను ఆయకట్టు పనులు జరిగాయో.. అందుకు రైతుకు ఆ సామాజిక వర్గానికి చెందిన జన్యూన్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వమని చెబుతూ కాంట్రాక్టర్ ఓబయ్యానాయుడు స్థానిక తహసీల్దారుకు విన్నవించారు. ఇందులో భాగంగా కాంట్రాక్టర్ వీఆర్వో ఏసుదాసును సంప్రదించినట్లు తెలిపారు. అయితే జన్యూన్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే 50 వేల రుపాయలు ఇవ్వాలని వీఆర్వో ఏసుదాసు డిమాండ్ చేసినట్లు తెలియజేశారు. బుధవారం కోడూరు రైల్వేస్టేషన్‌రోడ్డులోని ఎల్ఐసి కార్యాలయం సమీపంలో ఓబయ్యనాయుడు వద్ద నుంచి వీఆర్వో ఏసుదాసు 20వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందని, అనంతరం కోర్టుకు సమగ్ర నివేదిక అందించనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సీఐలు ఎల్లమరాజు, కృష్ణమోహన్, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

గంగమ్మ గుడిలో చోరీ

- హుండీ ధ్వంసం
- రూ.70వేల నగదు అపహరణ


హుండీ ధ్వంసం చేసిన దృశ్యం

మదనపల్లె : మండలంలోని సీటీఎం శ్రీనలవీర గంగాభవాని అమ్మవారి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు హుండీ ధ్వంసం చేసి, అందులో ఉన్న నగదు అపహరించారు. సుమారు రూ.70వేల నగదు, భక్తులు అమ్మవారికి ముడుపుల రూపంలో సమర్పించే వెండి కళ్లు కోరలు చోరీకి గురయ్యారని స్థానికులు, ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించి ఆలయంలోకి ప్రవేశించినప్పుడు ఆలయంలో పడుకున్న గౌరమ్మ గమనించిందన్నారు. చప్పుడు చేస్తే వారు తనను చంపేస్తారేమోనన్న భయంతో మౌనంగా ఉండిపోయిందన్నారు. బుధవారం ఉదయం ఆలయం తలుపులు తెరవగానే హుండీ ధ్వంసం చేసి ఉండటాన్ని స్థానికులు గమనించి ఆలయకమిటీ సభ్యులకు సమాచారం అందించారు. వారు గౌరమ్మను విచారించగా చోరీ జరిగిన విషయం చెప్పింది. ఈక్రమంలో సభ్యులు వెంటనే తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి ఆలయానికి చేరుకుని హుండీని పరిశీలించారు. ఘటనపై ఆరా తీశారు. క్లూస్‌టీం ఆలయానికి చేరుకుని ఆధారాలను పరిశీలించి తనిఖీ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని కమిటీ సభ్యులు తెలిపారు. గతనెలలో పగలు తిరుణాల తర్వాత హుండీ లెక్కించలేదని, దాదాపు రెండునెలలపాటు హుండీలో భక్తులు వేసిన నగదు రూ.70వేల వరకు ఉండవచ్చని పోలీసులకు తెలిపారు. చోరీ విషయమై తాలూకా సీఐ సత్యనారాయణనని విచారిస్తే బుధవారం సాయంత్రం వరకు తమకు చోరీ విషయమై ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించడంతో పాటు క్లూస్‌టీంతోనూ తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు.

రైళ్లపై రాళ్లు విసిరితే ఐదేళ్ల జైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణిస్తున్న రైళ్లపై ఎవరైనా రాళ్లు విసిరితే ఐదేళ్ల జైలు శిక్ష పడుతుందని కడప రైల్వే ఆర్‌పీఎఫ్ సీఐ ఎం.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవలి కాలంలో రైలు ప్రయాణించే సమయంలో దుండగులు, ఆకతాయిలు రాళ్లు విసురుతున్న సంఘటనలు అక్కడక్కడ జరుగుతున్నాయన్నారు. ఈ సమయంలో ప్రయాణికులు కొంతమంది గాయాల పాలవుతున్నారన్నారు. రైల్వే ఆస్తులకు నష్టం కలిగేలా వ్యవహరిస్తే సెక్షన్ 153 ప్రకారం ఐదేళ్ల జైలుశిక్ష పడుతుందన్నారు. చట్టాన్ని అతిక్రమించే ఆకతాయిలు, దుండగులు, సంఘ విద్రోహశక్తులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

‘పది’లంగా రాయాలంటే

టెన్త్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వీరు తొలిసారిగా పబ్లిక్ పరీక్షలను రాయనున్నారు. అందువల్ల వారిలో చిన్నపాటి ఆందోళన, హైరానా ఉంటాయి. ఈకారణంగా పరీక్షకు వెళ్లే సమయంలో ముఖ్యమైన హాల్‌టికెట్ వంటివి కూడా మరచిపోయే అవకాశం ఉంది. అందువల్ల విద్యార్థులు పరీక్షా హాలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షకు వెళ్లే తమ పిల్లలకు తల్లిదండ్రులు ఎలాంటి తోడ్పాటు అందించాలి వంటి విలువైన సూచనలు, సలహాలను రిటైర్డ్ డిప్యూటీ ఈఓ మునగాల కృష్ణకుమార్ తెలిపారు. – రాజంపేట టౌన్

విద్యార్థులు ఇలా చేయాలి

- పరీక్షా కేంద్రం ఎక్కడ ఉందో ముందురోజే వెళ్లి చూసుకుంటే మంచిది.
- ఉదయం 8–30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి
- 8–45 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. వెంటనే తమకు కేటాయించిన గదిలోకి వెళ్లి కూర్చొని మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి.
- హాల్‌టికెట్, ప్యాడ్, అవసరమైన పెన్నులు, పెన్సిల్స్, స్కేల్ రబ్బర్ వంటి పరీక్షా సామగ్రిని ముందు రోజు రాత్రే ఒకచోట ఉంచుకోవాలి.
- పరీక్ష ప్రారంభానికి ముందు 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. బుక్‌లెట్‌తో పాటు ఇచ్చే ఓఎమ్ఆర్ షీట్ తమదో కాదో నిర్ధారించుకొని పరీక్ష రాయడం ప్రారంభించాలి.
- అవసరమైతే 12 పేజీల మరో బుక్‌లెట్‌ను కూడా ఇస్తారు.
- సైన్స్ పరీక్ష రోజు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం రెండు పేపర్లను ఒకే రోజు రాయాల్సి ఉన్నందున మొదట ఇచ్చే 12 పేజీల బుక్‌లెట్‌లో భౌతికశాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- గంట తరువాత మరో 12 పేజీల బుక్‌లెట్ ఇస్తారు, అందులో జీవశాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది.
- ఈరెండు బుక్‌లెట్‌లను వేర్వేరుగా ఇన్విజిలేటర్‌కు అందజేయాలి. అదనంగా బుక్‌లెట్ తీసుకుంటే ఆయా సబ్‌జెక్టు సంబంధించిన ప్రధాన బుక్‌లెట్‌కు అదనపు బుక్‌లెట్‌ను జతచేయాలి.


ఇలాంటివి చేయకూడదు

- విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సెల్‌ఫోన్, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను తమవెంట తీసుకెళ్లకూడదు.
- పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్, బుక్‌లెట్ వంటివి మినహా మరే ఇతర కాగితాలు ఉంచుకోకూడదు.
- ఎట్టి పరిస్థితుల్లో ఆన్సర్‌షీట్‌ను పరీక్షా కేంద్రం నుంచి బయటకు తీసుకెళ్ల కూడదు.

విద్యార్థుల తల్లిదండ్రులు చేయాల్సినవి..

- టెన్త్ పబ్లిక్ పరీక్షల సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహితుల్లా ఉండి సహకరించాలి. వారికి కేటాయించిన పరీక్షా కేంద్రం ఎక్కడ ఉంది.. అక్కడికి సరైన సమయంలో చేరుకునేందుకు ముందుగానే ప్రణాళిక రూపొందించుకోవాలి.
- పరీక్షా కేంద్రానికి వెళ్లే సమయంలో హాల్‌టికెట్, పెన్నులు, పెన్సిల్, స్కేల్, రబ్బర్ వంటివి ఉన్నాయా లేవా అని ఒకసారి పరిశీలించాలి.

పిల్లలపై వత్తిడి చేయకూడదు



పరీక్షకు ముందు రోజు పొద్దుపోయే వరకు చదవమని పిల్లలపై వత్తిడి చేయకూడదు. పరీక్షలు ముగిసే వరకు ఆందోళన కలిగించే విషయాలు పిల్లల చెవిన పడకుండా చూసుకోవాలి. పిల్లలపై తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లో కోప్పడకూడదు. ఏదైనా తప్పు చేస్తే అది తప్పని సున్నితంగా చెప్పే ప్రయత్నం చేయాలి.

– మునగాల కృష్ణకుమార్, రిటైర్డ్ డిప్యూటీ ఈఓ, రాజంపేట